కె.ధనుంజయ

**ఓంకారనాదపు తరంగాలు శివాలయ శిఖరం నుండి నెమ్మదిగా ఊళ్లోకి పాకుతున్నాయి- మౌనంగా ఆశీర్వదిస్తున్నట్టు.**

**కార్తీకమాసం తన ప్రభావాన్ని చూపుతోంది. హిమం కురిసి చల్లబడిన ప్రకృతి సూర్యకాంతి రాకతో తెప్పరిల్లి రూపుమారుతోంది. మంచుబిందువు నిలిచిన గడ్డిపూవు, చిరుగాలికి ఊగిన చెట్టుకొమ్మ, వెల్లువలా విరిసిన మల్లెపూవు ప్రకృతిలోని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి.**

# ఒంటరి మనసు

శ్వేత పవనపు చిరుగాలి ఆమెను స్పృశిస్తూ ముందుకు సాగిపోయింది. ఆమె గుడి మెట్లమీద కూర్చుని వుంది. ఆమెను చూస్తూ ఒక్కక్షణం అలాగే వుండిపోయాను. నా మనసులో ఒక చిన్న హాయి తాలూకు భావన జనించి వెంటనే స్థిరమైంది. ఆమె పక్కనే నడుస్తూ ఆలయంలోకి వెళ్లాను. అక్కడ నిశ్చలంగా వెలుగుతున్న దీపపు కాంతిలో స్థిరంగా వుంది శివరూపం. పూజారిచ్చిన ప్రసాదం అందుకుని బయటకు నడుస్తుంటే, ఆమె గేటు దాటి వెళ్లిపోతూ కనిపించింది. నా మనసులో ఆ క్షణం ఏదో భావం, 'అనురాగం పంచేవాళ్లు అదృశ్యమవుతున్నట్టు'.

ఆమె కూర్చున్న వైపు చూశాను. ఆమె జడలోంచి జారిందో ఏమో, స్వచ్ఛతకు ప్రతిరూపంలో ఒక మల్లెపూవు వుందక్కడ. నవ్వుతూ పలుకరించింది. దగ్గరగా వెళ్లాను. ఒక చిన్న మంచుబిందువు మల్లె రెమ్మల మీద నిలచి సూర్యకాంతికి కరిగి ఆవిరయ్యే అక్షరి క్షణమది. విశాల ప్రకృతి తనలోని ప్రేమను ఆస్వాదించడానికి పంపిన శాంతిదూతలా వుందా మల్లెపూవు. నాలో సంతృప్తి నిండిన భావన జనించి తాకబోయాను. ఎందుకో నా చేయి వణుకుతోంది.

తీసుకుందామా, వద్దా అని ఒక్కక్షణం ఆలోచించాను.

నా మనసులో వింత అనుభూతి తరంగం అణువణువునా పాకుతోంది. చిరుగాలి నను తాకుతూ ముందుకు సాగిపోయింది. గాలితో పాటు మల్లె కూడా కదిలింది. అది చూసిన నా మనసు ఒక్కసారిగా ఉద్వేగంతో కదిలిపోయింది. ఆతృతగా మల్లెను అందుకోబోయాను. నా ప్రయత్నం ఫలించలేదు. మళ్లీ ప్రయత్నించాను. అటుగా ఎవరో వస్తున్నారు. వారి పాదాల క్రింద నలిగిపోతుందేమో నన్న భావన నాలో ఆతృతను రేపుతోంది.

అంతలో చిరుగాలి ఇంకొద్ది వేగంగా ముందుకు నెట్టిందేమో, అక్కడే వున్న ఒక తుమ్మిపూల చెట్టుచాటుకు చేరి నిలిచింది మల్లెపూవు.

నా పెదవులపై చిరునవ్వు జనించింది. సంతృప్తిగా దాని వైపు చూస్తూండిపోయాను. నాకెందుకో దాన్ని తీసుకోవాలనిపించలేదు. అక్కడే వుంటేనే బాగుంటుందేమో అనిపించింది. శిఖరం మీదున్న శివుణ్ణి ఒక్కక్షణం మనసులో స్మరించుకుని వెనుదిరిగి నడవడం ప్రారంభించాను.

మరోసారి చిరుగాలి నను తాకుతూ ముందుకు సాగిపోయింది.

లైబ్రరీలో ఎక్కువమంది లేరు. పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను. నవ్వుతూ ఎవరో వస్తున్న చప్పుడు. తలెత్తకుండానే గుర్తుపట్టాను వారిని. పచ్చటి పరికిణి కట్టుకుందామె. వారి రాకతో అక్కడంతా మల్లెపూల సువాసన నిండిపోయింది.

ఆమె వైపు చూశాను. చంద్రుడి వెన్నెలంత చల్లగా, శాంతంగా వుందామె. తనకు కావలసిన పుస్తకం తీసుకుని నాకు కొద్ది దూరంలోని బెంచీ మీద కూర్చుంది.

ఆ క్షణం నా గుండె శబ్దం నాకు స్పష్టంగా వినిపిస్తోంది. మనసు కదులుతోంది.

పుస్తకం చదవడం ఆపి ఆమె వైపే చూస్తున్నాను.

ఆమెను ఎప్పుడు చూసినా సముద్రమంత గంభీరత కనిపిస్తుంది నాకు. అందులో మళ్లీ శాంతమైన చిరునవ్వు. ఆ గుణాలే నన్ను ఆమె వైపు ఆకర్షించేలా చేశాయి.

ఆమె రూపాన్ని నాలో స్మరించుకుంటూ కళ్లు మూసుకున్నాను.

నాలో ఆమెను ఆరాధిస్తున్న హృదయం- వెళ్లి ఆమెని పలకరించమని చెబుతోంది. ప్రోత్సహిస్తోంది. ఆలోచించాను. అవును.. ఆమె ఆలోచనల్ని ఒంటరిగా నాలో నేనే తలుచుకోవడం మాని ఆమెతోనే చెప్పేస్తే... నా హృదయాన్ని ఆమెకు చెప్పగలిగితే...

అది చాలా మంచిదనిపించింది. మరో క్షణం ఆలోచించి, కొద్దిగా ధైర్యం తెచ్చుకుని ఆమె వద్దకు నడిచాను.

"శిరీషా" అన్నాను.

ఎందుకో నా గొంతు కాస్త తడబడింది.

ఆమె తలెత్తి చూసింది. మా చూపులు మౌనంగా కలుసుకున్నాయి. ఆమె ప్రశ్నార్థకంగా చూస్తోంది. నాలో మరింత తడబాటు పెరిగింది.

"మీతో... మీతో కొంచెం మాట్లాడాలి" ధైర్యంగా చెప్పేశాను.

ఆమె మొదట ఆశ్చర్యపోయింది. ఒక్కక్షణం ఆలోచించింది. మరుక్షణం తను చదువుతున్న పుస్తకం ప్రక్కన పెట్టి నవ్వుతూ పైకి లేచింది.

* * *

ఇద్దరం నది ఒడ్డున కూర్చున్నాం. సెలయేరు నెమ్మదిగా శబ్దం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇద్దరం మౌనంగా వున్నాం. మాట్లాడాలని పిలిచానేగానీ ఎలా మొదలుపెట్టాలో అర్థం కాలేదు. మరికొన్ని క్షణాలు గడిచాయి.

చివరకు ఆమే అంది. "మనసులో ఏ భావమున్నా అది ఇంకొకరితో చెప్పుకోవడంలో ఎంతో ఆనందముంది వేణూ. ఒక నిజం చెప్పనా. నన్ను చూడు. ఎప్పుడూ ఎంత హాయిగా వుంటాను. ఆ ఆనందం నాకు ఆ విధంగా లభించిందే ఏమో... నాకు మా అమ్మ మంచి ఫ్రెండ్. దాదాపుగా అన్ని విషయాలూ ఆమెతో చెప్పుకుంటాను. తనూ ఓ ఫ్రెండ్‌లానే మూవ్ అవుతుంది.

మనిషి ఎప్పుడు తనలోని ఏదైనా భావాన్ని బయటకు చెప్పాలని వున్నా చెప్పలేకపోతాడో అప్పటికి ఆ మనిషి ఇంకా ఎదగాలన్నమాట. అతనిలో ఆ విషయాన్ని బయటకు రానీయకుండా అడ్డుపడుతున్న ఆ బిడియం, ఆ కాంప్లెక్స్ ముందుగా బయటకు పోవాలి. అప్పుడే ఆ మనిషి హాయిగా ముందుకు సాగిపోగలడు.

నాకు తెలిసినంతవరకూ ఏ మనిషీ దురదృష్టవంతుడు కాదు. తనకేర్పడిన పనుల్ని సక్రమంగా నిర్వర్తించలేకో ఏమో ఒక్కోసారి వెనుకడుగు వేస్తూ వుంటాడు. అదే అతడి పతనానికి నాంది అవుతుంది. అక్కడ మొదలవుతాయి చిన్నగా కష్టాలు. అందులోనే అలాగే వున్నాడా- ఇక ఎప్పటికీ కోలుకోలేడు. ఏమిటి ఏకేమైనా అర్థమవుతోందా. కాలేదనుకుంటా. ఎందుకంటే ఒక్కసారి నేను ఏం

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

మాట్లాడతానే నాకే సరిగా అర్థం కాదు" చిన్నగా నవ్విం దామె.

నది గట్టున పెరిగిన రంగురంగుల గడ్డిపూలను చూస్తూ ఆనందంగా నవ్వుతోందామె. మనసుకు కలిగిన ఆనందం ఆ నవ్వులో స్పష్టమవుతోంది. ఎందుకో నా మన సులో వున్న భావాన్ని ఆమెకు చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. కొద్దిసేపటి తరువాత "వెళ్దామా" అంటూ లేచాను. "ఏదో చెప్పాలన్నావ్ కదా" అందామె. "తర్వాత చెప్తాలే" అంటూ బయలుదేరాను. ఆమె కూడా నాతో పాటే కదిలింది. ఇద్దరం పక్కపక్కనే నడుస్తున్నాం.

'ఆరోజు ఆమెతో పాటు అలా నడవడం' నిజంగా నా జీవితంలో మరచిపోలేని రోజది. కానీ అలాంటి రోజు నా జీవితంలో అదొక్కటేనని, అది కూడా అర్ధాంతరంగా ముగిసిపోతుందని మరో వారం రోజుల తరువాతగాని నాకు తెలిసిరాలేదు. ఇల్లు దగ్గర కాగానే ఆమెకు వీడ్కోలు చెప్పాను. ఇంటికెళ్లి భోజనం ముగించి మౌనంగా ఆలో చిస్తూ వుండిపోయాను. నా ఆలోచన ఆమె గురించే.


ఆ వయసుకే ఆమెకు అంతటి గంభీరత, నిశ్చలత ఎలా ఏర్పడ్డాయో. బహుశా.. తల్లిదండ్రుల క్రమశిక్షణ, జీవితం పట్ల సరైన అవగాహన, చదివిన పుస్తకాలు ఆమెలో అలాంటి భావాలు వృద్ధి పొందడానికి కారణం అయ్యుండొచ్చు. ఎంతమంది తల్లిదండ్రులు తమ పిల్ల లకు అలాంటి భావాలు నూరిపోయగలరు... నిజంగా ఎంతమంది పెద్దవాళ్లు తమ పిల్లల ప్రవర్తన పట్ల స్పష్ట మైన అభిప్రాయాల్ని ఏర్పరుచుకోగలరు.

నాన్న దగ్గరగా వచ్చాడు. నా ఆలోచనను ఆపి నాన్న వైపు చూశాను. డబ్బు కొరకు తన ఫ్రెండ్ వద్దకు వెళ్లి రమ్మని చీటీ వ్రాసిచ్చి పంపారు. నేను వెళ్లిన టైముకు ఆయన వద్ద డబ్బు లేకపోవడంతో అక్కడే కొద్ది రోజులు గడపాల్సొచ్చింది. అక్కడున్న కొద్ది రోజులూ భారంగా గడ చినా ఆమె జ్ఞాపకాలతో ఆనందపడ్డాను. ఆయన డబ్బివ్వ గానే ఊరికి బయలుదేరాను.

ఆమెను తొందరగా చూడాలన్న ఆతృత, చూడబోతు న్నానన్న ఆనందం నన్ను ఆ క్షణం తొందర చేస్తున్నాయి. ఆమెకు నా మనసును ఎలా చెప్పాలో బాగా ప్రిపేర్ అయ్యాను. బస్సెక్కాను. మళ్లీ అదే ఆలోచన.

నా మనసును ఆమెకు చెప్పగలనా?

బస్సు ముందుకు కదిలింది. నాకు నా గతం జ్ఞాపకమొ చ్చింది. సరిగ్గా ఇప్పటికి నాలుగు సంవత్సరాల క్రితం ఆమెను తొలిసారి చూశాను. మా క్లాస్‌లో ఆమె ఎప్పుడు ఫస్ట్ వస్తుండేది. అయితే ఆమెకు ఆటల్లోగానీ, ఇతరత్రా వేటిలోగానీ ఆసక్తి వుండేది కాదు. కానీ అందరినీ ప్రోత్సా హపరిచేది. దాదాపుగా అందర్నీ కమాండ్ చేయగలిగేది. అందుకే మా క్లాస్ తాలూకు బాధ్యతను ఆమెకు అప్పజె ప్పారు టీచర్స్. లీడర్‌గా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆమె మగవాళ్లతో ఎవ్వరితోనూ మాట్లాడేది కాదు. బహుశా అలాంటి సందర్భం రాలేకో ఏమో నాకు తెలీదు. అప్పటికే ఆమె మానసికంగా చాలా ఎదిగిపోందేమో అని పించేది. నాకు తెలియకనే నా మనసు ఆమెను గమనిం



చడంమొదలైంది.

ఒకసారి మా సోషల్ క్లాసులో క్విజ్ ఏర్పాటు చేశారు. క్లాస్ మొత్తాన్ని నాలుగు భాగాలుగా చేసి, ఒక్కో భాగానికి ఒక్కో లీడర్‌ని ఎన్నిక చేశారు. ఆ నలుగురిలో ఆమె కూడా ఉంది. తమకు కావాల్సినవారిని కోరుకోవచ్చని మాస్టారు చెప్పారు. వారు కోరుకుంటున్నారు. ఆమెకు ఛాన్స్ వచ్చింది. తలొంచుకుని మౌనంగా గమనిస్తున్నాను. ఒక్కక్షణం గడిచింది.

మాస్టారు ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. మరో క్షణం గడిచింది. ఆమె పెదవి విప్పి పేరు చెప్పింది. ఆ గొంతులో స్థిరత్వముంది. నా మనసులో ఏ మూలో ఒక చిన్న భావం బ్రద్దలైంది. కళ్లు ఆశ్చర్యంతో నిండిపోయాయి. ఆ పేరు నాది. ఆ తరువాత అందరి ఎన్నిక జరిగింది. మా బ్యాచ్ తరుపున ఆమె స్నేహితురాలు పేరును సూచిం చింది. క్లాస్ తరువాత వేగంగా ఇంటికి వెళ్లిపోయాను. పుస్తకం తీసి చదవడం మొదలుపెట్టాను. నాలో ఒకవిధ మైన పట్టుదల నిండిపోయింది. ఆమె కూడా బాగా చది వింది. క్విజ్ ముగిసింది. మా బ్యాచ్‌కు ఫస్ట్ మార్కులొ చ్చాయి. నాలో ఒక ఉద్వేగపూరితమైన ఆనందం నిండిపో యింది.

నా మనసు మారుమూలల్లో ఎప్పుడో నాటుకున్న ఒక చిన్న అభిమాన బీజం ఆ క్షణం చిన్నగా మొలకెత్తింది. ఆ తరువాత జరిగిన కొన్ని యాదృచ్ఛికమైన సంఘటనలు నన్ను ఆమె వైపు పూర్తిగా ఆకర్షించాయి. అయితే ఎప్పుడూ నేను ఆమెను పలుకరించడానికి ప్రయత్నించ

లేదు. అందుకు నాకు కొన్ని కారణాలున్నాయి. బహుశా అదే నేను చేసిన తప్పేమో. కాలం నాతో చాలా వికృతంగా ఆడుకొంది. ఆమెను వాళ్ల నాన్నగారు వాళ్ల బంధువుల ఊళ్లోని స్కూల్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించారు. నా మనసు కదిలిపోయింది. నాలోని భావాలన్నీ నిర్లిప్తమయ్యాయి. కాలేజ్ చదువు కూడా పూర్తయింది. మధ్యలో సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా నాలో ఆమె తాలూకు భావాలు మాత్రం అలాగే వుండిపోయాయి. డిగ్రీ పూర్తి చేసుకుని ఆమె ఊరికి తిరిగి వచ్చింది. ఆమెలో అదే నిశ్చలత ఇప్పుడు కూడా వుంది.

ఆలోచనలతో గతపు ప్రపంచాన్ని చూస్తున్న నేను, నాకు సమీపంగా ఏదో వెహికల్ పెద్దగా హార్న్ మోగిస్తూ వెళ్లడంతో ఉలికిపాటున లేచి సర్దుకున్నాను. కిటికీలోంచి ఆకాశం వైపు చూస్తున్నాను. ఆ క్షణం నా మనసులో మళ్లీ ఏదో కదలిక మొదలైంది.

నన్ను నేను గమనిస్తే "తొలిసారి చూసిన ఓ కంటి చూపు, ఆమె గొంతు నుంచి వెలువడిన ఒక చిన్న మాట (నా పేరు), నిశ్చలత నిండిన ఆమె రూపం, సంవత్సరాల పాటు దూరమైన ఎడబాటు తరంగం, నాలోని పిరికితనం, నా ప్రేమకు బీజాలైతే కావచ్చు. కానీ ఇంకా ఏదో వుంది. అన్నింటికీ మించిన ఒక గొప్ప ఆత్మీయతానురాగం ఆమె కొరకు నాలో దాగి వుంది. దాని పేరేమిటో తెలియదు. అంతలా ఆమెను నా జ్ఞాపకాలలో ప్రేమించాను. ఆరాధించాను. అందులోనే జీవించాను.


'ఓ మనసా...

విశ్వజనీనమైన ప్రేమ సృష్టికి ఆధారమైతే అది పొందడానికి అందులోని ప్రతీదీ అర్థమైందే. అలాంటి ఆ ప్రేమను వ్యక్తం చేయడానికి హృదయాంతరాలలో దాగివున్న నిశ్శబ్ద భావపూరిత ప్రకంపనాలు అక్షరాలలో, అవి అలలు అలలుగా సాగే నా మది నీలి ఆకాశం నీ ముందు పరుచుకోవాలని...

మదిలోని భావం, ఎద నిండిన జ్ఞాపకం, మనసు యొక్క మాయ, సంపూర్ణ ప్రేమపూరిత జలదిగ్బంధం ఒక్కసారిగా విస్ఫోటనం చెంది...

ఆ క్షణం... రాగమై.. గేయమై.. ప్రాణమై.. నాకు.. ఓ మనసా నాక్కొంచెం ధైర్యాన్నివ్వు.. నను నీతో స్వేచ్ఛగా మాట్లాడనీ.. నా.."

బస్సు సడన్ బ్రేక్‌తో హార్న్ మోగిస్తూ ఆగడంతో మరోసారి నా ఊహాప్రపంచం నుంచి బయటపడ్డాను. ఊరొచ్చేసింది. దాదాపుగా అందర్నీ తోసుకుంటూ క్రిందికి దిగాను. పరుగు లాంటి నడకతో ఇల్లు చేరుకున్నాను. నాన్నకు డబ్బులిచ్చి తొందర తొందరగా స్నానం చేసి బట్టలు మార్చుకున్నాను. బయటకు బయలుదేరాను. అమ్మ అన్నం తినమని దాదాపుగా అరుస్తోంది. నేను ఆగలేదు. ముందుకు సాగిపోయాను.



నా మనసులో ఏదో భావం క్షణక్షణానికోసారి బద్ధలవుతోంది.

ఏదో జరుగుతోంది... ఏదో జరుగుతోంది.

నా నడక వేగం పెంచాను. కాలికి తగిలిన గాయం రక్తాన్ని స్రవిస్తోంది. క్లోజ్‌ఫ్రెండ్స్ ఇద్దరు పిలుస్తున్నారు. వేటినీ పట్టించుకోలేదు నేను. ఆమె ఇల్లు వచ్చేవరకూ ఎక్కడా ఆగలేదు. దాదాపుగా పరిగెత్తాను. ఒకచోట నా నడక ఒక్కసారిగా ఆగిపోయింది. కొద్ది దూరంలో ఆమె ఇల్లు కనిపించింది. నా కళ్లు ఆమె కోసం వెతుకుతున్నాయి. రెండు నిమిషాల నిరీక్షణ తరువాత నా ప్రయత్నం ఫలించింది. ఆమె ఇంటి అరుగు మీద కనిపించింది.

ఉవ్వెత్తున ఎగిసిన భావకెరటంలా ఆ క్షణం ఆమె వైపు పరిగెత్తాలని ప్రయత్నించాను. అంతలోనే ఆమెను ఎవరో నలుగురు ఆడవాళ్లు చుట్టుముట్టడంతో అలాగే వుండిపోయాను. పచ్చటి చీరలో చాలా అందంగా వుందామె. నా కళ్లు నిశ్చలంగా గమనిస్తున్నాయి. ఆమెను కాదు- ఆమె ఇంటి ముందు వేసిన పచ్చటి పందిరిని. నా మనసులో ఏదో అపశృతి.

'ఏదో... జరిగిపోయింది...'

అక్కడి భావాన్ని గ్రహించిన నా మనసు నిస్సహాయంగా చూస్తూ వుండిపోయింది. కాళ్లు చిన్నగా వణుకుతున్నాయి. 'ఎందుకు... ఎందుకిలా జరిగింది' ఘోషిస్తోంది నా మనసు. అక్కడే అలాగే వుండిపోయాను.

## తథాస్తు

ఈ పదం మనం ఎక్కువగా వింటుంటాం. మనం ఏదైనా మనసులో అనుకుంటే పైన తథాస్తు దేవతలుంటారని, వాటిని వారు అమలుచేస్తారని మన పెద్దలంటుంటారు. ఇప్పుడు ఈ పేరుతో బాలీవుడ్‌లో ఓ చిత్రం నిర్మితమవుతోంది. సంజయ్‌దత్, అమీషాపటేల్, జయప్రద, దర్శన్ జరీవాలా, కైలాష్ కౌశల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం గురించి అంచనాలు బాగానే ఉన్నాయి. ఈ చిత్రానికి నితిన్ మన్మోహన్ నిర్మాతకాగా, అనుభవ్ సిన్హా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

కారు స్టార్టయిన శబ్దం విని చిన్నగా తలెత్తి చూశాను. ఆమె కారు వద్ద నిలబడి వుంది. ఒకతను అప్పుడే వచ్చి కార్లో కూర్చున్నాడు. ఆమె తన చెల్లెలితో ఏదో మాట్లాడుతోంది.

మరో క్షణం తరువాత ఆమె ఇటువైపు తిరిగింది. మా చూపులు మౌనంగా కలుసుకున్నాయి. నా హృదయాంతర గుహలో ఏదో భావం బ్రద్దలు కావడానికి ఆ క్షణం ఊపిరి పోసుకుంటోంది. ముక్కలైన నా గుండె తన అస్తిత్వం నిలుపుకోడానికి నిస్సహాయంగా ప్రయత్నిస్తోంది. అణువణువునా దాగివున్న శక్తిని ఒక్కసారిగా కూడబలుక్కుని ఆ చివరి క్షణాల్లోనైనా చెప్పాలని అడుగు ముందుకు వేయబోయాను. అంతలోనే ఆమె వెళ్లిరానా అన్నట్టు చూసింది.

నా అడుగు ఆగిపోయింది. మనసు మూగబోయింది. క్షణకాలం కాలగర్భంలో కలిసిపోయింది.

ఆ క్షణం నిశ్చలమై నిర్మలమై నాలో ఏదో భావం..

మరో క్షణం ఆమె నావైపు చూసి తలొంచుకుని కారులో కూర్చుంది. అందరూ

ఆమెకు వీడ్కోలు చెప్తున్నారు. కారు చిన్నగా ముందుకు కదిలింది. నా కాళ్లు భూమికి అతుక్కుపోయి నట్టు చలనం లేకుండా వున్నాయి. ఆ క్షణం నా కళ్లల్లో ఒక చిన్న నీటిపొర జనించి, అది పాయలై కనుకొలకులు దాటి చెంపల మీదుగా జారిపోయింది.

ఆరాధించిన హృదయం క్షణక్షణం అనంత దూరానికి పయనిస్తుంటే నా మది నిశ్శబ్ద ఆకాశపు చివరన నిస్సహాయంగా కొట్టుకుంటూ రోదిస్తోంది హృదయం. కంటికి కనిపించనంత దూరం కారు వెళ్లిపోయింది. ఆ క్షణం నాకు తెలియగానే నా పెదవులపై ఒకవిధమైన చిరునవ్వు జనించింది.

ఎవరికోసమో... ఎందుకోసమో...

నిరంతర భావ జ్ఞాపకాలను మది నిండా నిక్షిప్తం చేసుకుని, ఎవరికో అంకితమివ్వాలని, సాగరం అంచునుండి బయలుదేరి, రాత్రి పగలనక ప్రయాణించి, అక్కడ ఏ హృదయం వేచి వుందనే...

ఆశగా కనిపించిన ఒడ్డుకు చేరి...

ఆతృతగా జ్ఞాపకాల ముడిని విప్పబోతే అది తాను మొదలెట్టిన తీరమేనని తెలిసి సముద్రం తనవైపు నిస్సహాయంగా చూస్తున్న ఒక అమాయకుడి గుండె నుండి వెలువడిన విషాద ఛాయపు నవ్వులా వుందది...

ఒక వేదాంతపు నవ్వు...

కళ్ల నుండి జారిన నీరు చారలు ఇంకిపోయాయి. అయినా వాటి స్పర్శ అలాగే వుంది. అక్కడే కనిపించిన అరుగు మీద కూర్చోబోయి మనసొప్పక మరికొద్ది దూరం ముందుకు నడిచాను. అక్కడ కనిపించిన ఒక అరుగు మీద ఆలోచిస్తూ కూర్చున్నాను. అలా ఎంతసేపు గడిచిపోయిందో.

నా భుజం మీద తగిలిన చేతిస్పర్శకు తలెత్తి చూశాను. ఎదురుగా ఒక చిన్న అమ్మాయి నవ్వుతూ నిలబడి వుంది. ప్రశ్నార్థకంగా చూశాను. ఒక చిన్న కవర్ అందిస్తూ ఒక క్షణం పాటు చిరునవ్వు నవ్వి శివాలయం వైపు పరిగెత్తింది. ఆశ్చర్యంగా కవర్ వైపు చూస్తూ ఆ అమ్మాయి వెళ్లిన దిక్కుకు చూశాను. నా మనసులో ఉద్వేగం జనించింది. కవర్ మీద నా పేరు వ్రాసి వుంది. ఆతృతగా కవర్ తెరిచాను. మడత పెట్టిన కాగితం కనిపించింది. మడతలు విప్పుతుంటే చేతులు వణుకుతున్నాయి. పేపర్ మీద అక్షరాలు గుండ్రంగా వున్నాయి.

చిన్నగా చిరుగాలి నను తాకుతోంది.

చదవడం ప్రారంభించాను.

* * *

"వేణూ... నాకు తెలుసు నీ మనసు. అది నేనేనాడో అర్థం చేసుకున్నాను. మనిషి మనుగడలో 'మనసు' స్థానం ఏపాటిదో నాకూ తెలుసు వేణూ. ఆ మనసు మన హృదయాల్లో చేసే క్రియ ఎంత సున్నితంగా వుంటుందో...

అనురాగాలు, ఆత్మీయతలు, అనుబంధాలు, ప్రేమ... ఇలా ఎన్నెన్నో భావాలు క్షణకాలంలో స్పందింపజేయగల అద్భుత శక్తి మనసు. అందుకే ఆ మనసంటే నాకెంతో గౌరవం, అభిమానం. అందరి మనసూ సున్నితమైందే.

మన పరిచయం ఎంతో యాదృచ్ఛికమైనా అది ఎప్పుడూ గుర్తుండిపోయేదే. నీ హృదయం నాకు కొద్దిరోజులకే తెలిసిపోయింది. నీ భావం నాకు చెప్పాలన్న నీ మూగప్రయత్నం గమనించాను. నీ గురించి ఆలోచించాను చెప్పడానికి అవకాశం వచ్చినా ఎందుకు చెప్పలేక పోయావా అని.

సమాజం గురించిన భయం, ఇంటి స్థితిగతులు, భవిష్యత్తును గురించిన ఆలోచన, నీనుండి ఆ విషయాన్ని బయటకు రానీయకుండా చేశాయి. నా గురించయితే చిన్నతనం నుండి క్రమశిక్షణతో పెంచిన తల్లిదండ్రులు, నా వ్యక్తిత్వ వికాసం కోసం తపించే తండ్రి, కుటుంబ గౌరవం నిలబట్టే అర్హత నాకే వుందని ఎప్పుడూ అమ్మగారితో అంటూండే నాన్నగారి ఆత్మవిశ్వాసం ఆ క్షణం నేను బయటపడడానికి అడ్డుగా నిలిచాయి.

ఇన్ని కట్టుబాట్లు, తల్లిదండ్రులు, సమాజం, అన్నింటినీ ఎదిరించి అందరికీ దూరంగా ఎక్కడికో వెళ్లి ఒక్కటయ్యామే అనుకో- ఏమిటి మనం సాధించేది. మన మనసుల కలయికా?... తరువాత కొద్దికాలం గడిస్తే మన మధ్య ఒక అమాయక ప్రాణి... ఎందుకో ఆ క్షణం మనమింకా ఎదగాలేమో అనిపించింది.

ఇందరి మనసుల్ని బాధించి ఎక్కడో దూరంగా వెళ్లి తెగిన గాలిపటాల్లా బ్రతకాలనిపించలేదు. ఆ పని చేయడానికి నా మనసొప్పలేదు. ఏదైనా మార్గం వుందా అని ఆలోచించాను. మా నాన్నగారితో చెప్పి నా బలవంతం మీదే స్కూల్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. 'కాలం నీ మనసులోని భావం మార్చగలదని, కొద్దిగానైనా మార్పు తేగలదని...' చాలా దూరం వెళ్లిపోయాను. కానీ మన మధ్య పెరిగిన దూరం మన జ్ఞాపకాల్ని మరింత దగ్గర చేస్తాయని ఊహించలేకపోయాను. చదువు సమయంలో చాలావరకూ నీకు కనిపించకుండా వుండడానికి ప్రయత్నించాను. ఏమిటో ఈ మనసు. నిన్ను చాలా బాధిస్తున్నానేమో అనిపించేది. ఎన్నోసార్లు అన్నింటినీ తెంచుకుని రావాలనిపించేది. జీవితపు చివరి అంచుల్లో వున్న తల్లిదండ్రులు, వారు నామీద పెంచుకున్న ఆశలు, నమ్మకం...

అసలు మనసును ఎందుకింత సున్నితంగా వుంచుకోవాలి. అందరిలా వుండిపోతే...

ఇలా ఎన్నెన్నో భావాలతో ఎన్నో రోజులు ఆలోచిస్తూనే వున్నాను..."

నేను ఉత్తరం చదవడం ఆపాను. ఉత్తరంలో ఇంకా ఎన్నో భావాలను వ్రాసిందామె.

స్త్రీ మనసు ఎంతో సున్నితమైందని, అగాథం లాంటిదని, దాన్నర్థం చేసుకోవడం అంత సులభం కాదని అంతవరకూ వినడమూ, పుస్తకాల్లో చదవడమేగాని, నా అనుభవంలో అలాంటి సందర్భమూ, అవసరమూ అంతవరకూ ఎప్పుడూ తారసపడలేదు. తొలిసారిగా ఇప్పుడు స్త్రీ అంటే ఏమిటో కొద్ది కొద్దిగా అర్థమవుతోంది. నా గురించిగాని, తన గురించిగాని, లేకుంటే సమాజం గురించిగాని, ఆమె అంతదూరం ఆలోచిస్తుందని ఊహించలేకపోయాను.

నాకెందుకో ఆ ఉత్తరాన్ని పూర్తిగా చదవాలనిపించ లేదు.

ఒక్క స్త్రీ మనసే కాదు, అసలు ఎవరి మనసైనా వారివైపునుంచి ఆలోచించి నిర్ణయించడం అంత సులభం కాదని అర్థమయింది. ఆ భావన కలిగాక హృదయంలో వున్న ఆర్ద్రత ఎవరో తీసివేసినట్టు మనసు కొద్దిగా స్థిరమైంది. అంతవరకూ మౌనంగా వున్న చెట్లకొమ్మలు చిరుగాలి తాకిడికి నెమ్మదిగా కదలడం ప్రారంభించాయి. మన మనసులో కలిగే భావాలకు ప్రకృతి అంత బాహాటంగా ప్రతిస్పందిస్తుందా అనిపించింది.

ఓ స్త్రీ... ఓ ప్రకృతీ... మీ హృదయాంతర భావాలు ఎప్పుడు మాకు యధార్థంగా అర్థమవుతాయి. అసలది మాకు సాధ్యమా!

చేతిలో ఉత్తరం గాలి తాకిడికి రెపరెపలాడుతోంది.

దూరంగా దేవాలయం నుంచి ఏదో భక్తిగీతం మంద్రంగా వినిపిస్తోంది. చిరుగాలి స్పర్శ నాకు ఏదో బోధిస్తున్నట్టు ముందుకు సాగుతోంది.

నా చేతి వేళ్లు నెమ్మదిగా విచ్చుకున్నాయి. ఉత్తరం జారి, నేలను అలలు అలలుగా తాకుతూ ముందుకు సాగుతోంది. మౌనంగా చూస్తున్నాను. గుబురుగా పెరిగిన తుమ్మిపూల చెట్లచాటుకు చేరి, అదే తన గమ్యస్థానం అని చెప్పడానికో ఏమో, అక్కడే నిలబడిపోయింది ఉత్తరం. మరొక్క క్షణం అటువైపు చూసి పైకి లేచాను.

ఆమె నా హృదయాన్ని అర్థం చేసుకుందన్న ఆనందమో... ఇకమీదట నేను చేయవలసిన కర్తవ్యమేమిటో బోధపడిందో... లేక నాలో ఏ మూలో దాగి వున్న అహంభావమో తెలియదుగానీ, రెండు చేతుల్నీ పేంటుజేబుల్లో వుంచుకుని నడుస్తూ అక్కడినుంచి సాగిపోయాను.

శివాలయం నుంచి వీచిన చిరుగాలి మరోసారి నను తాకుతూ ముందుకు సాగిపోయింది.

